## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధర పురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కబేళా సెంటర్, కబేళా ఇండస్ట్రియల్ ఏరియా సెకండ్, థర్డ్, ఫోర్త్, ఫిఫ్త్ క్రాస్‌రోడ్స్, బ్రహ్మయ్య కాలనీ, కెనరా బ్యాంక్ వెనుక భాగం ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### దొంగతనం కేసు కొట్టివేత

విజయవాడలీగల్: తోడికోడలిపై పెట్టిన దొంగతనం కేసును విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది. వన్‌టౌన్ వించిపేటకు చెందిన సుతారి శ్రీలత తన ఇంట్లో చోరీకి పాల్పడిందని ఆమె తోడి కోడలు సుతారి వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2020లో వెలుగు చూసిన ఈ ఘటనపై న్యాయస్థానంలో వాదోపవాదనలు జరిగాయి. తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారం చోరీ చేశారని శ్రీలతపై అభియోగం మోపారు. సుదీర్ఘ విచారణ చేసిన న్యాయస్థానం పోలీసుల సమక్షంలో సాక్షులను విచారించింది. విచారణ అనంతరం శ్రీలతపై మోపిన అభియోగం సరైనది కాదని న్యాయస్థానం అభిప్రాయపడింది. నిందితురాలిగా పోలీసులు పేర్కొన్న సుతారి శ్రీలత ఎటువంటి తప్పు చేయలేదని నిరూపణ కావడంతో ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

### మౌలానా ఆజాద్ సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత తొలి విద్యాశాఖా మంత్రి, స్వాతంత్య్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ దేశానికి అందించిన సేవలు అపూర్వమని వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమం వించిపేటలోని ఆసిఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ ఇతర నాయకులతో కలిసి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధునిగా, కేంద్రంలో తొలి విద్యాశాఖ మంత్రిగా భారతదేశ అభివృద్ధికి ఆయన బాటలు వేశారన్నారు. ఆయన హయాంలోనే అనేక కేంద్ర విద్యాసంస్థలను స్థాపించారన్నారు.

### రేపు పార్వతీ కల్యాణం కూచిపూడి యక్షగానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈనెల 24వ తేదీ సోమవారం సాయంత్రం 6.30 గంటలకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో పార్వతి కల్యాణం కూచిపూడి యక్షగానం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు శనివారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ చింత రవి బాలకృష్ణ శిష్య బృందంచే ఈ ప్రదర్శన జరుగుతుందని వివరించారు. శివుడు, పార్వతీ దేవిల కల్యాణానికి సంబంధించిన అంశాలను ఈ ప్రదర్శనలో కళాకారులు ప్రదర్శిస్తారన్నారు. ఈ ఉచిత ప్రదర్శనకు అందరూ హాజరుకావాలని కోరారు.

### నేడు త్రిశక్తిపీఠంలో దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): టెన్త్, ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 23వ తేదీన బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో సరస్వతీ పూజ, సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు.

### గ్రూప్-2 పరీక్ష వాయిదా కోరుతూ ఆందోళన

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు శనివారం ఆందోళనకు దిగారు. లబ్బీపేట పైడియ్యవీధిలోని హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు ఏపీపీఎస్సీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదు. దీంతో అభ్యర్థులు అక్కడే హాస్టల్ ఎదుట రోడ్డుపై రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతించని పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌ను కలిసేందుకు పలువురిని అనుమతించడంతో వారు అక్కడికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని, వాటిని సవరించాలని ఏపీపీఎస్సీ అధికారులను కోరారు.

# కబేళా కంపు.. రోగాల ముప్పు

- అభివృద్ధికి నోచుకోని కబేళా
- అపరిశుభ్ర వాతావరణంలో జంతు వధ
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- దుర్వాసనతో స్థానికుల అవస్థలు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్



మేకలు, గొర్రెలను వధించే హాల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని కబేళా దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక సమస్యలతో కునారిల్లుతోంది. తొలుత నిర్మించిన కబేళా భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 1998లో రూ.2 కోట్లతో ఆధునిక భవనం నిర్మించారు. మరో కోటి రూపాయలతో అధునాతన పరికరాలను కొనుగోలు చేశారు. భవనం అయితే నిర్మించారు గానీ రూ.కోటితో కొన్న అధునాతన పరికరాలు మాత్రం మాయమైపోయాయి. అప్పట్లో ఈ ఉదంతంపై పెద్ద దుమారమే చెలరేగింది. సంబంధిత అధికారుల నుంచి సరైన సమాధానం లభించలేదు. ఆ తరువాత అంతా గప్‌చిప్ అయిపోయింది. కబేళాకు కొత్త భవనం నిర్మించి దాదాపు మూడు దశాబ్దాలు కావస్తుండగా ఇప్పుడు అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. నాడు నగర శివార్లలో నిర్మించిన ఈ కబేళా కాలక్రమేణా నేడు జనావాసాల మధ్య అయింది. చుట్టుపక్కల నివసించేవారు కబేళా నుంచి వచ్చే దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నారు.

**సంప్రదాయ విధానంలోనే జంతు వధలు**

నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పలువురు వ్యాపారులు తమ జంతువులను కబేళాకు తీసుకువస్తున్నారు. అవి ఆరోగ్యంగా ఉన్నాయో లేదో పరిశీలించిన తరువాత నగరపాలక సంస్థకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్టిఫై చేసిన తరువాత వధిస్తారు. ప్రస్తుతం కబేళాలో రోజుకు సుమారు 400 జంతువులను (మేకలు, గొర్రెలు, దున్నలు, గేదెలు) వధిస్తున్నారు. అధునాతన పరికరాలు లేకపోవడంతో వాటన్నింటినీ సంప్రదాయ విధానంలోనే వధిస్తున్నారు. తద్వారా నగరపాలక సంస్థకు సుమారు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. అయినా కబేళా అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. డ్రెయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వ్యర్థాల దుర్వాసన భరించలేనంతగా వస్తోంది. గతంలో కబేళా ప్రాంగణంలోనే జంతువుల వధ తరువాత వచ్చే వ్యర్థాలు, మురుగునీటి కోసం ఒక పిట్ ఉండేది. ఇప్పుడు దానిని మూసేసి వధ్యశాలలో ఏర్పాటు చేసిన పైపుల ద్వారా రోడ్డు మీద ఉన్న సంప్ హౌస్‌కు తరలిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కబేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బయో మిథినేషన్ ప్లాంట్ ఆకారానికి భారీగానే కనిపించినా పని చేయక నిరుపయోగంగా ఉంది.



శిథిలావస్థకు చేరుకున్న కబేళా భవనం

**బృందావనం కాదు...నరకాన్ని తలపిస్తోంది**

కబేళా నుంచి వచ్చే దుర్వాసన భరించలేనంతగా ఉంటోందని కబేళా ప్రహరీ పక్కనే ఉన్న బృందావన్ కాలనీ ప్రజలు వాపోతున్నారు. గేదెలు, దున్నల కోసం అనధికారికంగా నిర్మించిన షెడ్ల నుంచి వాటి అరుపులు, ఆర్తనాదాలతో తమకు నిద్ర కూడా పట్టటం లేదని వాపోతున్నారు. మరో వైపు నిబంధనలకు విరుద్ధంగా కబేళా ఆవరణలోనే ఎక్కడ పడితే అక్కడ జంతు వధ చేస్తుండటంతో వచ్చే దుర్వాసనకు వాంతులు కూడా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరకు కబేళా లోపల నుంచి జంతువులను వధించటం ద్వారా వచ్చే రక్తం, వ్యర్థాలు కాలనీలోని సైడు కాలువలో ప్రవహించేవని, ఆ వాసనకు తట్టుకోలేక కబేళా ప్రహరీ గోడలో ఏర్పాటు చేసిన రంధ్రాలను మూసివేశామని కాలనీవాసులు తెలిపారు. అయినా జంతువుల వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నాయని అంటున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




పని చేయక నిరుపయోగంగా ఉన్న బయో మిథనైజేషన్ ప్లాంట్

# మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ బాబు

వీఎంసీ ఇన్‌చార్జ్ సీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇంటింటికీ వెళ్లి వ్యర్థాలు సేకరించడమే కాకుండా అక్కడే సెగ్రిగేషన్ చేసి నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం శానిటరీ సెక్రటరీలు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ల సర్వైలెన్స్‌ల ద్వారా నగరంలో ఉన్న వ్యర్థాలను గుర్తించడమే కాకుండా వాటిని సత్వరమే తొలగించేలా ఎంత మంది శానిటరీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి, అందుకు గల కారణాలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌పై విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు అందరూ తమ పరిధిలోగల షాపుల యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**మార్చి1 నుంచి చట్టరీత్యా చర్యలు చేపట్టండి**

మార్చి ఒకటవ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డాక్టర్ సురేష్ బాబు ఆదేశాలు జారీ చేశారు. దోమకాటు వలన ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా నిరంతరం యాంటీ లార్వా ఆపరేషన్లు జరుగుతుండాలన్నారు. ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే కూడా జరగాలని మలేరియా సిబ్బందికి చెప్పారు. సమావేశంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యేసుపాదం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.సోమశేఖరరెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం చిర్రావూరు గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాలలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకోవటానికి అవకాశమున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యంగా ప్రజల స్థితిగతులతో పాటుగా ఆర్థిక, సామాజిక అంశాలను తెలుసుకుని తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకుడు కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో అడుగులు వేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ముందడుగు వేస్తే చక్కని విజయాలను సొంతం చేసుకుంటారని ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.శ్రీదేవి అన్నారు. పాతబస్తీలోని శ్రీ తెలప్రోలు రాజా హైస్కూల్ వార్షికోత్సవం ఆ విద్యాసంస్థ ప్రాంగణంలో శనివారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే చక్కని నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మరో అతిథి ఏఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ కరస్పాండెంట్ తెలప్రోలు రూపేశ్వరగుప్తా, సహాయ కార్యదర్శి టి.సందీప్, ప్రధానోపాధ్యాయిని పి.గీతారాణి తదితరులు ప్రసంగించారు.

# జూనియర్ వైద్యుల రక్తదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యను పూర్తి చేసుకుని కొద్దిరోజుల్లో బయటకు వెళ్లనున్న జూనియర్ వైద్యులు శనివారం రక్తదానం చేశారు. ప్రభుత్వాస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమంలో 70 మంది జూడాలు రక్తదానం చేశారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఉపయోగపడేలా ఏపీ జూడా ఎస్ఎంసీ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రక్తదానం చేసిన జూడాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అభినందించారు.

# పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, శ్రీదేవీ కళా నాట్యమండలి, కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ప్రదర్శించిన పద్యనాటకాలు నాటక వైభవాన్ని చాటాయి. విద్వాన్ కణ్వశ్రీ రచించిన బాలనాగమ్మ నాటికను మనోహరంగా ప్రదర్శించారు. ఎస్ విజయలక్ష్మి బాలనాగమ్మగా, జెట్టి సాంబశివరావు మాయప ఫకీరుగా, కార్యవర్ధిరాజుగా డీవీ నరసింహారావు, బాలవర్ధి రాజుగా జీవన్‌కుమార్ పాత్రోచితంగా నటించారు. రెండవనాటికగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ఘట్టాన్ని ప్రదర్శించారు. పావులూరి పాములు హరిశ్చంద్రునిగా, అడపా ప్రభావతి చంద్రమతిగా, నక్షత్రకునిగా గాబ్రియేలు కాలకౌశికునిగా నెక్కంటి సాంబశివరావు నటించారు. జాషువా కవి రచించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు కొయ్యూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పద్యనాటకం తెలుగువారి ఆత్మ అని అభివర్ణించారు.



బాలనాగమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

# మధురంగా సాగిన గాత్ర సంగీత కచేరీ



గాత్ర సంగీత కచేరీ నిర్వహిస్తున్న తుషార పూర్ణవల్లి

విజయవాడ కల్చరల్: నెలనెలా యువరాగం కార్యక్రమంలో భాగంగా శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మహతిహాల్‌లో శనివారం గాత్ర సంగీత విద్వాంసురాలు తుషార పూర్ణవల్లి నిర్వహించిన కర్నాటక సంగీత గాత్ర కచేరీ మధురంగా సాగింది. వాగ్గేయకారులు రచించిన పలు సంప్రదాయ కీర్తనలను ఆమె మధురంగా ఆలపించింది. వయోలిన్‌పై కే సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై సీహెచ్ హరినాథ్ సహకరించారు. సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ యువగాయనీ గాయకులను ప్రోత్సహించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. సంగీత విద్వాంసురాలు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

# ఆన్‌లైన్ కోర్సులతో మరిన్ని అవకాశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇందుకోసం ఆన్‌లైన్ కోర్సులను ఉపయోగించుకోవాలని కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు సూచించారు.స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆమె అతిథి ఉపన్యాసం ఇచ్చారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యుజిసి ప్రారంభించిన స్వయం మూక్స్‌లో ఉన్న ఆన్‌లైన్ కోర్సులు వాటి వివరాలు, ఏ విధంగా రిజిస్టర్ చేసుకోవాలి, ఆయా కోర్సులను పూర్తిచేసేందుకు పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాశ్మీర్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చి తమ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇవ్వడం అభినందనీయమంటూ డాక్టర్ హిమబిందును అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ కొల్లేటి రమేష్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ హిమబిందును సత్కరిస్తున్న అధ్యాపకులు

# నిద్రలేమితో దీర్ఘకాల వ్యాధులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆహారం సరిగా తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం ద్వారా దీర్ఘకాల వ్యాధులు సంక్రమిస్తాయని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగశేషమ్మ పేర్కొన్నారు. స్థానిక రాజీవ్‌నగర్లోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం ఆమె ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవలను అందించాలని సూచించారు. డాక్టర్ వంశీలాల్ రాథోడ్ మాట్లాడుతూ విపత్తు సమయాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు ఎంతో కీలకమని వివరించారు. ఏపీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.రమేష్, దంత వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి కడియం శ్రీదేవి, సహాయ అధికారిణి యండి హసీనా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు కలిసి నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నాగశేషమ్మ

# వాహనం బోల్తా

ఇబ్రహీంపట్నం: జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం వద్ద వాహనం అదుపు తప్పి శనివారం బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని ముందుగా గుర్తించిన వాహన డ్రైవర్, క్లీనర్ వాహనం నుంచి బయటికి దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు కలుషితం

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గంలోని 104 గ్రామాలకు తాగునీరు అందించే ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో బూడిద నీరు కలవడంతో తాగునీరు కలుషితమైంది. బూడిద నీరు సరఫరా చేసే పైపుల లీకేజీతో రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో నియోజకవర్గంలోని 104 గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం కూడా మరోసారి పైప్‌లైన్లు లీకేజీ కావడంతో చన్నీటి కాలువలో బూడిద కలిసి పంప్‌హౌస్‌లో ఫిల్టర్ బెడ్‌లు మొరాయించాయి.

**ప్రజా పోరాట సమితి ఆందోళన**

విషయం తెలుసుకున్న ప్రజా పోరాట సమితి సభ్యుడు, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంప్ హౌస్ వద్దకు చేరుకున్నారు. పంప్‌హౌస్‌లో కలిసిన బూడిద నీటిని పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ పరిసర గ్రామాల్లో వాతావరణ కాలుష్యంతో స్వచ్ఛమైన గాలి కరువైందన్నారు. ఇప్పుడు స్వచ్ఛమైన తాగునీరు కూడా ప్రజలకు అందించలేని దుస్థితి ఏర్పడిందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తాగునీటి కాలుష్యానికి కారుకులైన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి కాలుష్య ప్రాంతాన్ని విజయవాడ పర్యావరణ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు ఎన్టీటీపీఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్య్ర సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అన్నారు. అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం 119 సచివాలయం పరిధిలోని విద్యాధరపురం తాజ్ మసీద్ వీధిలోగల ఎస్ఎంఎస్ స్కూల్‌లో వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు షేక్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం జరిగింది. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు సవరణకు చంద్రబాబు మద్దతు ఇచ్చి మైనార్టీలకు ద్రోహం చేశారని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యతిరేకించి మైనార్టీలకు అండగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్ష నేతగా ప్రజల్లోకి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు షేక్ హయాత్ షరీఫ్, షేక్ నజీర్, రంజని, బీఆర్ఎల్ గౌస్, సయ్యద్ యాసిన్, విద్యార్థులు పాల్గొన్నారు.



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెహమతున్నీసా, హయాత్, నజీర్ తదితరులు

# భారతీయ నృత్య సంప్రదాయాలు విశిష్టమైనవి



నృత్యపోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ తదితరులు



చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: భారతీయ నృత్య సంప్రదాయాలు విశిష్టమైనవని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. సంస్కార భారతి మహానగర్, సుమధర కళానికేతన్ ఆధ్వర్యంలో భరతముని జయంతి సందర్భంగా రెండురోజులపాటు నిర్వహించే జాతీయ సంప్రదాయ నృత్య పోటీలు గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సంస్కారభారతి ద్వారా బాలబాలికలలోని ప్రతిభను గుర్తించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతను దేశ భక్తివైపు మళ్లించి వారిని ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. సంస్కార భారతి నగర అధ్యక్షుడు పసుమర్తి భాస్కర శర్మ మాట్లాడుతూ నాట్యశాస్త్రానికి గురుతుల్యుడైన భరతముని సేవలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. తొలి రోజు కార్యక్రమంలో సోలో విభాగంలో భరతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యం అంశాల్లో పోటీలు నిర్వహించారు. నగరంలోని ఆరు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ పోటీలను సంస్కార భారతి క్రియాశీలక సభ్యులు శ్రావణ్‌కుమార్, సాయిశంకర్, సీతాలక్ష్మి, బి.రూపశ్రీ, జీఎస్‌డీ కుసుమసాయి, చింతా దూండీ కృష్ణ పర్యవేక్షించారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.